క్లుప్తంగా

గ్రామాల్లో మేలుకొలుపు సందడి



సత్యవరంలో మేలుకొలుపులు నిర్వహిస్తున్న భక్తులు

మాడుగుల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం సత్యవరం, గాదిరాయి, ఒమ్మలి, జేడీపేట, కింతలి, ఎం. కోడూరు, జంపెన గ్రామాల్లో మేలుకొలుపులు నిర్వహించారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇందులో భాగంగా తెల్లవారు నుంచి రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మాడుగుల రూరల్: వంటర్లపాలెంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ అనిల్ నీరుకొండ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించే శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షించి మందులు అందజేస్తారన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

మాకవరపాలెం: సాధికార బస్సుయాత్రను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు కోరారు. సోమవారం సాయంత్రం తామరంలో వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులో నర్సీపట్నంలో బస్సుయాత్ర జరుగుతుందన్నారు. నేపథ్యంలో జరిగే భారీ బహిరంగ సభకు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

10 బెడ్‌లతో ఐసోలేషన్ వార్డు సిద్ధం



సీహెచ్‌సీలో కోవిడ్ వైద్య సేవలపై ట్రయల్ రన్



శ్రీలక్ష్మి

కె.కోటపాడు: స్థానిక 50 పడకల ఆస్పత్రిలో కోవిడ్ వ్యాధి గ్రస్తులకు పది బెడ్‌లతో కూడిన ఐసోలేషన్ వార్డు సిద్ధం చేశామని సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి తెలిపారు. ట్రయల్ రన్‌లో భాగంగా సోమవారం ఇక్కడ ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. కోవిడ్ పరిస్థితులు మరలా ప్రారంభమవుతున్న దృష్ట్యా ఆస్పత్రికి వచ్చే వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. జ్వరం, జలుబు, తలనొప్పితో బాధపడుతున్న వారు తప్పనిసరిగా పరీక్షించుకోవాలన్నారు. జాగ్రత్తలను పాటిస్తూ, వ్యాధినిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఇప్పటికే పది బెడ్‌లతో కూడిన ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశామన్నారు.

తగ్గిన ఉల్లి, టమాటా ధరలు

కశింకోట: కొన్ని నెలలుగా కొనుగోలు దారులకు చుక్కలు చూపించిన ఉల్లి, టమాటా ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. కశింకోట మండలం తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఉల్లిపాయ, టమాటా ధరలు తగ్గాయి. టమాటా, ఉల్లిపాయలు కిలో రూ.40 నుంచి రూ.30కి తగ్గి విక్రయాలు సాగాయి. బంగాళాదుంపలు రూ.30, వంకాయ, బెండకాయ, దొండకాయ, కాకరకాయ, బరబాటి రూ.80, చిక్కుడుకాయ రూ.120, బీన్స్ రూ.100కు విక్రయాలు సాగాయి. మిగతా కాయకూరల ధరలు ఏమాత్రమూ తగ్గలేదు.



నాడు అధ్వానం... నేడు అధునాతనం

ఒకనాడు మురుగుకూపంగా దర్శనమిచ్చిన దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నేడు అధునాతన హంగులతో ఆహ్వానిస్తోంది. గత పాలకుల నిర్లక్ష్యంతో దశాబ్దాలుగా గొయ్యిలతోపాటు చెత్తా చెదారాలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. వర్షాకాలంలో బస్సుల కోసం పది నిమిషాలైనా నిల్చోలేని పరిస్థితి ఉండేది. ఈగలు, దోమలతోపాటు అక్కడ వెలువడే దుర్వాసనకు ప్రయాణికులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కసారిగా రూపురేఖలు మారిపోయింది.

- రూపురేఖలు మారిన దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్
- రూ.30 లక్షలతో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం
- రూ.10 లక్షలతో మరుగుదొడ్ల ఏర్పాటు
- సీఎంఆర్ సహకారంతో భవనానికి నూతన హంగులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో కొత్త రూపు



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు



అధ్వానంగా దర్శనమిస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ (నాడు)



అధునాతనంగా దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ (నేడు)

దేవరాపల్లి: నిత్యం ప్రయాణికులతో సందడిగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణను రూ. 30 లక్షలతో సిమెంట్ ప్లాట్‌ఫాంగా నిర్మించారు. ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందుల దృష్ట్యా రూ. 10 లక్షలతో మరుగుదొడ్లను నిర్మించి, నిరంతరం మంచినీటి సౌకర్యం కల్పించేలా బోరును ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని సైతం విశాఖపట్నం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరావు సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో కాంప్లెక్స్ ఆవరణ ఆహ్లాదకరంగా మారింది.



ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులతో కళకళలాడుతున్న ఆర్టీసీ కాంప్లెక్స్

దేవరాపల్లికి బస్సులు రాక పోకలు ఇలా....

మద్దిలపాలెం, గాజువాక, అనకాపల్లి, వాల్తేరు, సింహాచలం డిపోల నుంచి దేవరాపల్లికి పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి, విజయనగరం జిల్లాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుండటంతో ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రాధాన్యత నెలకొంది.

ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధిని ఊహించలేదు



గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంతా భారీ గొయ్యిలతో ఛిద్రంగా ఉండేది. చినుకు పడితే తటాకాన్ని తలపించేది. కాంప్లెక్స్‌లోకి బస్సు మలుపు తిప్పాలంటే నానా అవస్థలు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ పాలనలో కాంప్లెక్స్ రూపురేఖలు మారిపోయాయి. సీసీప్లాట్‌ఫాం, మరుగుదొడ్లు నిర్మించి, ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని అభివృద్ధి చేశారు.

– వి. సోమునాయుడు, ఆర్టీసీ డ్రైవర్, విశాఖపట్నం

దుర్వాసన వెలువడేది



ప్రైవేటు సెక్టార్ ఉద్యోగం చేస్తున్న నేను రోజూ దేవరాపల్లి నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగిస్తాను. గతంలో వర్షం పడితే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అడుగు పెట్టలేక పోయేవారం. కాంప్లెక్స్ ఆవరణలో గొయ్యిలతోపాటు చెత్తా చెదారాలు పేరుకుపోయి దుర్వాసన వెలువడేది. కనీసం పది నిమిషాలు వేచి ఉండాలంటే ముక్కు మూసుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి చేయడంతో మా కష్టాలు తప్పాయి.

– బాబి, ఆర్టీసీ ప్రయాణికుడు, దేవరాపల్లి

సంక్షేమ బాధ్యత సోషల్ మీడియా కన్వీనర్లదే

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



విప్ ధర్మశ్రీకి జ్ఞాపిక అందిస్తున్న కన్వీనర్లు

బుచ్చెయ్యపేట: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సోషల్ మీడియా కన్వీనర్లపై ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం బుచ్చెయ్యపేట మండలంలో సోషల్ మీడియా కన్వీనర్లుగా అయితరెడ్డి ప్రసాద్, బైన గిరి బాబు, ముచ్చకర్ల వెంకటరావు, వియ్యపు నాగరాజు, కొల్లి దశరథ్, అయితరెడ్డి ప్రసాద్, అయితి రాము, చేబోలు చంద్, చోడపల్లి శ్రీను, రాము, వరహామూర్తి తదితరులకు ఐడెంటీ కార్డులను విప్ ధర్మశ్రీ అందించారు. అనంతరం కన్వీనర్లు ఆయన్ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మాడుగుల: స్థానిక జగ్గన్న సావిడి వద్ద సోమవారం దివంగత మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దంగేటి సూర్యారావు, పుట్టా గంగయ్య, ఉండూరు రాజు, మండల సుబ్బలక్ష్మి, పుట్టా రాంబాబు, వి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొండపాలెంలో సీసీరోడ్డును ప్రారంభించిన విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండలంలోని కొండపాలెంలో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. నెల రోజుల క్రితం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ముత్యాలమ్మ గుడి నుంచి సోమిరెడ్డి వీరునాయుడు ఇంటి వరకు సీసీరోడ్డు వేయాలని విప్ ధర్మశ్రీని గ్రామస్తులు కోరారు. ఆ మేరకు రూ. 4 లక్షలు మంజూరు చేయడంతో అధికారులు రోడ్డు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు గుమ్మిడి రాజునాయుడు, నాయకులు గుమ్మిడి సింహాద్రి, ముచ్చకర్ల శ్రీను, పెద్దాడ శ్రీను, ఎంపీటీసీ కేశంశెట్టి వెంకటరమణ, సర్పంచ్ ముచ్చకర్ల అప్పారావు, జగన్నాథం, కర్రి దేవుడమ్మ, సాలాపు ఈశ్వరరావు, ఎస్కే రహమాన్ పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

పార్టీ గెలుపు కోసం కృషి



జోసెఫ్ కార్యాలయంలో మంత్రి, ఎంపీ

అనకాపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుకోసం పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మండలంలో కొత్తూరు పంచాయతీ శారదానగర్ మెయిన్ రోడ్డులో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోసెఫ్) నూతన కార్యాలయాన్ని సోమవారం ఎంపీ బీవీ సత్యవతితో కలిసి ప్రారంభించారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బి.వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సర్వం సిద్ధం

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటలు పోటీలకు సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో హనుమంతరావు సోమవారం తెలిపారు. మండలంలో 17 సచివాలయాల పరిధిలో పీఈటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఆటలాడేందుకు 488 మంది ఆన్‌లైన్లో రిజిస్ట్రేషను చేసుకున్నారన్నారు. క్రికెట్‌కు పురుషులు 62, మహిళలు 35 మంది, బ్యాడ్మింటన్‌కు పురుషులు 92, మహిళలు 1, వాలీబాల్‌కు పురుషులు 53, మహిళలు 34, కబడ్డీకి పురుషులు 40, మహిళలు 37, ఖోఖో పురుషులు 34, మహిళలు 50 మంది చొప్పున నమోదు చేసుకున్నారన్నారు. మంగళవారం అన్ని సచివాలయాల్లో ఈ పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు.

రోలుగుంట: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభిస్తారని ఈవోపీఆర్డీ ఎ.నూకరాజు సోమవారం తెలిపారు. ముందుగా కొవ్వూరులో ప్రారంభిస్తారన్నారు.



నాతవరంలో ఆట స్థలం

కె.కోటపాడు: మండలంలో అన్ని సచివాలయాల్లోను మంగళవారం నుంచి ఆడుదాం...ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు మెటీరియల్‌ను ఇప్పటికే సచివాలయాలకు పంపించామన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌లో పోటీలను ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ ప్రారంభిస్తారన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కొత్తకోట ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దేవరాపల్లి: తన ప్రేమతత్వంతో విశ్వ మానవళిని సన్మార్గం వైపు నడిపించిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కాశీపురం సియోను ప్రార్థనా మందిరంలో నిస్సీ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ డాక్టరు గొర్లె టైటస్, గ్రేస్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి చిన్నారులకు తినిపించారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సహనం కలిగి ఉండాలని మానవాళికి ఏసుక్రీస్తు గొప్ప సందేశాన్ని అందించారన్నారు. రాష్ట్ర ప్రజలందరిపై కరుణామయుడి దీవెలను ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ముత్యాలనాయుడును గొర్లె టైటస్, గ్రేస్ దంపతులు, క్రైస్తవులు గజమాలతో ఘనంగా సత్కరించారు. విశాఖపటనం రిజర్వ్ ఏఎస్సై నిర్మల్‌కుమార్, దీవెనమ్మ దంపతులు పలువురికి క్రిస్మస్ బహుమతులను అందజేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దాసరి గోపి, దాసరి మంగునాయుడు, చలుమూరి చంద్రమోహన్, ఆదిరెడ్డి అక్కునాయుడు, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, రాజు ప్రకాష్, ఉదయ్, భాను పాల్గొన్నారు.

శుభాకాంక్షలు చెప్పిన విప్ ధర్మశ్రీ

చోడవరం: క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం ఉదయం నుంచి చర్చిల వద్ద క్రైస్తవ మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సామూహిక భోజనాలు చేసి క్రిస్మస్ పండగను అంతా ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రాంధీ గ్రామం ఆర్సీఎం చర్చితోపాటు చోడవరం ద్వారకానగర్ ఇమ్మానియల్ చర్చి, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువతీ యువకులు కిస్మస్ తాత వేషాలు వేసి డ్యాన్సలతో సందడి చేశారు. లక్కవరం చర్చిలోనూ యువకులు కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. పాస్టర్ డానియల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోవాడ చర్చిలో పాస్టర్ అనంతరావు, అన్నవరం చర్చిలో పాస్టర్ డి. కిరణ్ ప్రార్థనలు చేశారు.



28వ వార్డులో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణంలో పురాతన ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, కెనియడన్ బాప్టిస్ చర్చి, సెయింట్ పాలు లూథరన్ దేవాలయంతోపాటు యేరుషలేము ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 28వ వార్డు ఇన్‌చార్జి తానేటి సూర్యచంద్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గణేష్ పాల్గొని కేక్ కట్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బి. సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఆంధ్రా బాప్టిస్ చర్చిలో ప్రేమ ధార రేడియో సువార్తికుడు రెవరెండ్ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ మానవాళికి రక్షణ కల్పించేందుకు ఏసుక్రీస్తు మానవ స్వరూపుడిగా భూమిపై జన్మించాడన్నారు. యేరుషలేము ప్రార్థనా మందిరంలో నిరుపేదలకు బిషప్ డానియల్ దుస్తులు పంపిణీ చేశారు.

బుచ్చెయ్యపేట/రావికమతం/చీడికాడ/గొలుగొండ/మాడుగుల రూరల్/మాడుగుల/నాతవరం/మాకవరపాలెం/కె.కోటపాడు: గ్రామ గ్రామాన క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బాలబాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తకోట ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి ఉల్లాసంగా గడిపారు. విశాఖ బిషప్ హౌస్ చాన్సలర్ ఫాదర్ కిశోర్, స్థానిక చర్చి ఫాదర్ అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. కె.జె.పురం హౌసింగ్ కాలనీలోని క్రీస్తు సంఘం చర్చిలో పాస్టర్ జోస్ఫ్ ఆధ్వర్యంలో పార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. బుడబండి రాజు, తదితరులు పాల్గొన్నారు. జోగుంపేటలో లెవంజకల్ ఫెలోషిప్ చర్చిలో విందు ఏర్పాటు చేశారు. కొండల అగ్రహారం ఇమ్మానుయేలు చర్చిలో బిషప్ కె.జీవన్‌రాయ్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. మాకవరపాలెం పెంతుకొస్తు ప్రార్థనా మందిరం, క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో రెవ రెండ్ టి.వి.రత్నం, విక్టర్‌పాల్, పాస్టర్లు కిరణ్‌పాల్ క్రిస్మస్ విశిష్టతను వివరించారు. కె.కోటపాడులో యు.ఈ చర్చిలో రెవరెండ్ ప్రేమ్‌కుమార్ మహంతి, లియో చంద్రయ్యపేటలో పాస్టర్ దేవకుమార్, వారాడ, వి.సంతపాలెం, కొత్త అగ్రహారం గ్రామాల్లో స్వారత్రిక క్రీస్తు సంఘంలో రెవరెండ్ ఎస్.మోజేష్, ఎ.కోడూరు క్రియేటర్ వర్షిప్ చర్చిలో డాక్టర్ శేఖర్, బ్రదర్ రాజు, శైలేష్, చౌడువాడలో ఆంధ్రాబాపిస్ట్, ఆనందపురంలో ప్రేమ సముద్రం, పాతవలసలో పాస్టర్ సువార్తరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కె.కోటపాడు చర్చిలో క్రీస్తు జనన ఘట్టాన్ని ఆవిష్కరించేలా చిన్నారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రోలుగుంట రోమన్ కేథలిక్ చర్చి లో కొత్తకోట చర్చి విచారణ ఫాదర్ అజయ్ కుమార్ చిన్నారులతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం సువార్త చదివి వినిపించారు. చిన్నారుల వేషధారణ, నాటికలు ఆకట్టుకున్నాయి. బుచ్చింపేట చర్చిలో గ్రామా నికి చెందిన సోషల్ వర్కర్ అనిమిరెడ్డి రమణ 60 మందికి పది రోజులకు సరిపడా నిత్యావసర సరకులు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దైవజనులు



యేరుషలేం ప్రార్థన మందిరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బిషప్ డానియల్



మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో ప్రసంగిస్తున్న జీవన్‌రాయ్



క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న రేడియో సువార్తికుడు రెవరెండ్ జోసఫ్ కుమార్



కె.జె.పురం కాలనీలో చర్చిలో పార్థనలు చేస్తున్న క్రైస్తవులు



రావికమతంలో ఒక క్రిస్టియన్ సోదరి ఏర్పాటు చేసిన అందమైన శాల



చుక్కపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



వడ్డాది చర్చిలో క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న ఫాదర్